దీపావళి కథల పోటీలో
**ప్రథమ బహుమతి**
పొందిన కథ

# నేలమీది జాబిలి



**తూ**రుపుదిక్కు తెల్లపొద్దుపొడుస్తోంది.

సెల్‌టవర్స్ రేడియేషన్ విషవలయంలో ఉనికిని కోల్పోతున్న చివరితరం ఊరపిచ్చుకలు ఉషాబాలకు విషాద స్వాగతాలను పలికి, పలికి అలిసిపోయి, ఆఖరున ఆహారాన్ని వెతుక్కుంటూ ఎక్కడికో ఎగిరిపోయాయి.

జగ్గయ్యపేట పట్టణానికి పడమరదిక్కు చివరన ఉన్న బండ్ల బజారు మురికి కాలువకు, పాలేరుకూ మధ్య ఉన్న గడ్డమీద యానాదుల గుడిసెలను చూస్తుంటే నేలతల్లి ఎదమీద లేచిన కంచర పొక్కుల్లా అసహ్యంగా కన్పిస్తున్నాయి.

వంటి మీద ఏ అచ్ఛాదనా లేని కొంతమంది యానాదుల పిల్లలు దుర్గంధం వెదజల్లుతున్న మురికి కాలవలో ఆనకట్టలు కడుతూ ఆడుకుంటున్నారు.

ఆ గుడిసెల్లో ఓ మూలగా ఉన్న తన గుడిసె ముందు

సర్కార్ తుమ్మచెట్లకింద 'పేదరిక నిర్మూలనే తన ధ్యేయంగా చెప్పుకుంటున్న' ఓ రాజకీయ నాయకునికి స్వాగతం పలుకుతూ కార్యకర్తలెవరో వేయించిన పాత ఫ్లెక్సీబోర్డు పట్టా మీద వెల్లికిలా పడుకుని శూన్యంలోకి చూస్తూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు సొట్టోడు.

సొట్టోడికి అరవై ఏళ్లుంటాయి. మనిషి నల్ల తుమ్మ తుంటలా ఉంటాడు. తలమీద రాగివర్ణంలో మెరుస్తున్న జుట్టు నీగ్రోల జుట్టును తలపిస్తుంది. ఖాకీ నిక్కర్ తొడుక్కుని, దానిమీద మాసిపోయిన తెల్లచొక్కా వేసుకున్నాడు. వెలుగును కోల్పోయిన చిన్న చిన్న కళ్లు ఎక్కడో లోపలికి పోయి ఉన్నాయి. సన్నటిముక్కు, పొగాకు నమిలీ, నమిలీ నల్లగా గారపట్టిన పండ్లు, పొడుగూ, పొట్టీకాని ఎత్తుతో పీలగా తూటికాడ తిని పారుడు రోగం తగిలిన నల్లగొర్రిలా ఉన్నాడు.

సొట్టోడి అసలు పేరేంటో వాడు కూడా ఎప్పుడో మర్చిపోయాడు. వాడి చిన్నప్పుడోసారి ఫీర్ మహమ్మద్‌పేట చింతలపాటి కృష్ణమూర్తి గారి కుంటలో చేపలు పడుతుంటే... బురదలో కూరుకుపోయిన వాడి ఎడమకాలి పిక్క మీద 'ఇంగిలీకం' కుట్టి సెప్టిక్ అవ్వడంతో వాడి తాత యానాది అప్పన్న ఏదో పసరుకట్టు కట్టాడు. ఆ పసరుకట్టుకి సెప్టిక్ అయితే మానిపోయింది గాని, కట్టుకట్టినంతమేర కాలు కాస్తా అవిసిపోయింది. దాంతో వాడు కాలు ఎగరేసుకుంటూ నడవసాగడం, అదుగో... అప్పటినుంచి వాడి పేరు కాస్తా 'సొట్టోడి'గా స్థిరపడిపోయింది.

సొట్టోడికి ఇద్దరు మగ, ఇద్దరు ఆడ... మొత్తం నలుగురు పిల్లలు. నలుగురికీ పెండ్లిల్లయ్యాయి. ఆడబిడ్డలిద్దరూ అత్తగారిండ్లకుపోతే, కొడుకులిద్దరూ వేరుపడిపోయారు.

"సొట్టతాతా! సొట్టతాతా! నీకోసం ఎవరో వచ్చిండ్రు" మురికి కాలువలో తోటి పిల్లలతో ఆడుతున్న సొట్టోడి మనవడు గుడిసె దగ్గరకు పరుగెత్తుకొచ్చి చెప్పడంతో ప్రాణం వచ్చిన శవంలా లేచికూర్చున్న సొట్టోడికి మురికి కాలువకు ఆవలి ఒడ్డున నిలబడి తనవైపే చూస్తున్న 'గిరి గిరి బ్యాంక్' బాలిరెడ్డి కన్పించడంతో గతుక్కుమంటూ లేచినిలబడి "వస్తడొస్తడని అనుకుంటనే ఉన్న, రానే వచ్చిండు" అనుకుంటూ భయం భయంగా అతని దగ్గరకెళ్లి "ఏందండీ రెడ్డి గారూ! కాకితో కబురంపితే వచ్చి మీ ముందు వాలే సొట్టోని కోసం మీరీ మురికివాడకు రావాల్నా?" అన్నాడు.

"ఏంజేస్తందొరా! ఇచ్చినోడు పిచ్చికుక్క, తిన్నోడు తిరపతెంకన్నని ఊరికే అన్నారా? నీ పెండ్లానికి రోగమొచ్చిందని ఆఫీస్‌కాడికొచ్చి కాళ్లా వేళ్లా పడితే... పోన్లేపాపం! పొద్దున్నలేస్తే కళ్ల ముందు మట్టికడుక్కుని బతికే ముసల్నా కొడుకు... యాడికిపోతాల్లెమ్మని రెండు వేల రూపాయలు ఇచ్చింది మొదలు మళ్లీ కనబడితే వట్టు! మరింక రాకేంజెయ్యాలి?" వెటకారము, వెకిలితనమూ కలగలిసి మాటల తూటాలు రువ్వాడు బాలిరెడ్డి.

"కనిపించక నేనేడికి బోయిన రెడ్డిగారూ! మాయావిడ రోగం సంగతి మీకు తెల్సిందేగదా! ఆ పనిమీదనే తిరుగుతున్నా. ఎంత తిరిగినా రోగం మాత్రం తగ్గట్లే. నాలుగు రోజులోపిక పట్టండి... మీపైసలు మీకు పువ్వుల్లోపెట్టిస్తా" బలిపీఠం ముందు మోకరిల్లిన మేకపిల్ల ఆఖరి ప్రార్థనలా బాలిరెడ్డి ముందు తలనేలకు వాల్చి నిల్చుంటూ బామాలసాగాడు సొట్టోడు.

"ఆ కతలన్నీ నాకెందుగ్గాని, ముందు నా

శిరంశెట్టి కాంతారావు

డబ్బులెప్పుడిస్తావో తేల్చిచెప్పు". అంటూ నోరు పెద్దది చేసుకున్నాడు బాలిరెడ్డి.

* * *

జగ్గయ్యపేట పట్టణం మొదటినుంచీ బంగారపు పనికి పెట్టింది పేరు.

ఊళ్లో షావుకారులంతా అటు శివాలయం వీధి నుంచి మొదలుపెట్టి ఇటు రంగనాయకుల గుడిదాకా వందలమంది స్వర్ణకారులతో ఆర్డర్ల మీద బంగారు ఆభరణాలు చేయిస్తుంటారు.

అట్టా నగలు చేసేటప్పుడు బంగారాన్ని రకరకాల డిజైన్లలో కటింగులు, ఫైలింగులు చేయడంతోపాటు తీగలుగా సాగదీయడం, మెరుగు పెట్టడం చేస్తుంటారు. అటువంటి సమయాల్లో ఎంతో కొంత బంగారం కనిపించీ కనిపించని మోతాదులో చిన్న చిన్న ముక్కలుగా లేచిపోతూంటుంది. దాన్నే వినియోగదారుడికి తరుగు కింద లెక్కగడుతుంటారు.

ప్రతిరోజూ పనైపోగానే కుంపటి ముందు నుండి లేచిన స్వర్ణకారులు ఆ కుంపట్లచుట్టూ మెత్తటి కుంచలతో నెమ్మదిగా ఊడ్చి, పోగు చేసిన కసువునంతా ఓ మూలకు రాశి పోసి, రెండు మూడు నెలలకోమారు దాన్నంతా కడిగిస్తుంటారు. అట్లా కడిగిస్తే వచ్చే తరుగు బంగారమే స్వర్ణకారులకు కలిసొచ్చే అదనపు ఆదాయం.

ఊళ్లో ఆ మట్టి కడిగే పనిని యానాదులు చేస్తుంటారు. వాళ్లందరిలోకీ సొట్టోడికి మట్టి కడగడంలో మంచి పేరుంది. వాడొక్కసారి మట్టి కడిగాడంటే చాలు... ఆ తరువాత దుర్భిణీవేసి వెదికినా ఆ మట్టిలో నలుసంత బంగారం కూడా దొరకదని పేరు.

సొట్టోడు, వాడి భార్య చెంచమ్మ మామూలుగా శివాలయం వీధిలో రంగాచారి ఇంటి మూల మలుపులోని కాలువలో మట్టి కడుగుతుంటారు.

బతుకంతా ఆ కాలువ మురుగుని పీల్చడంతోపాటు, వేళకు సరైన తిండి తినకపోవడం, పరగడుపు నుంచే సారాయి తాగడం మూలంగా చెంచమ్మ ఆరోగ్యం మెల్ల మెల్లగా క్షీణించిపోయింది. దాంతో ఏం చేయాలో దిక్కుతోచని సొట్టోడు చెంచమ్మని ధర్మాసుపత్రి చుట్టూ కాళ్లు అరిగేలా తిప్పినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో బాలిరెడ్డి దగ్గర పదిరూపాయల వడ్డీకి రెండు వేలు తీసుకుని భార్యని ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించాడు. అయినా ఆమె ఆరోగ్యం ఏమాత్రం బాగుపడకపోవడంతో విధిలేక మళ్లీ తీసుకుపోయి ధర్మాసుపత్రిలోనే పడేసి వచ్చాడు.

అసలే భార్య అనారోగ్యంతో దిక్కు తోచకుండా ఉన్న సొట్టోడికి పుండుమీద కారం జల్లి



## రచయిత పరిచయం

శ్రీ శిరంశెట్టి కాంతారావు కథలు వివిధ పత్రికలలో 60 వరకూ ప్రచురితమయ్యాయి. వీటిలో 15 కథలకు రాష్ట్రస్థాయి పోటీలలో బహుమతులు లభించాయి. 'కంచి మేకలు' అనే కథాసంపుటం ప్రచురించారు. బి.ఎ.,ఎల్.ఎల్.బి. చదివిన శ్రీ కాంతారావు ఉద్యోగరీత్యా 'స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్'లో పనిచేస్తున్నారు. కీ॥శే॥ అనంతయ్య, పిచ్చమ్మ గార్లు వీరి తల్లితండ్రులు.

నట్టు ఆర్థికమాంద్యం దెబ్బకు బంగారం ధర అమాంతం చుక్కలు చూడడంతో సామాన్యులె వ్వరూ బంగారం వైపు కన్నెత్తి చూసే ధైర్యం కూడా చేయడం లేదు. దాంతో ఒక్కసారిగా మార్కెట్ మొత్తం స్తంభించిపోయింది. ఆ దెబ్బ తో ఊళ్లో ఉన్న స్వర్ణకారులంతా ఉపాధిలేక షావుకారి దగ్గర వడ్డీలకు తెచ్చుకుని రోజులు దొర్లించసాగారు. ఆ అప్పులు కూడా పుట్టని వాళ్లు సైనైడ్ మింగి తనువులు చాలించుకుం టున్నారు.

స్వర్ణకారుల గతే అట్టా ఉంటే ఇక మట్టి కడిగే యానాదుల గురించి వేరే చెప్పేదేముం ది? పూట గడవడమే కష్టమైపోయిన వాళ్లల్లో కొందరు పంటపొలాల్లో కావలికాస్తూ, మరి కొందరు పాములను వేటాడి వాటి చర్మాలు, విషం అమ్ముకుంటూ, ఇంకొందరు ఏట్లో చేప లు పట్టి అమ్ముకుంటూ కాలం గడపసాగారు...

సొట్టోడు భార్య వైద్యం కోసం బాలిరెడ్డి దగ్గర తీసుకున్న అప్పు ఆ విధంగా దిగబడి పోయింది. ఇప్పుడా బాకీ వసూలు కోసమే సొట్టోడి ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు బాలిరెడ్డి.

నేనిటు డబ్బుల గురించి అడుగుతుంటే, నువ్వేటో ఆలోచించుకుంటూ కట్టుకొయ్యలా నిల్చున్నావేంటి?" అంటూ గద్దించాడు బాలి రెడ్డి.

బాలిరెడ్డి గద్దింపుతో వాస్తవంలోకొచ్చిన సొట్టోడు మరింత కుదేలైపోతూ "మాయావిడ ఇయ్యాల్నో, రేపో అన్నట్టు ధర్మాసుపత్రిలో ప డుంది. ఇన్ని రోజులాగినోల్లు వచ్చే శావనందాక ఆగండి. శావనంలో లగ్గాలుంటై గాబట్టి జనం ఎట్టైనా బంగారం అంతో, ఇంతో కొనక తప్ప దు. మల్లా కంసాలి కుంపట్లు రాజుకోక తప్ప దు. అప్పుడు మాగ్గూడ కడిగేటందుకు మట్టి దొరుకుద్ది. మీ బాకీ అణాపైసల్తో సహా తీర్చేస్తా" అంటూ కాళ్లా వేళ్లా పడి ప్రాధేయపడసాగాడు...

"ఈ వ్యాపారంలోకి దిగిన దగ్గర్నుండి ఇ ట్లాంటి మాటలన్నీ వినీ, వినీ నా చెవులమీది బొచ్చంతా నెర్సిపోయింది. కచ్చితంగా నా డబ్బు లెప్పుడిస్తావో చెప్పు. లేదంటే ఐదు నిమిషాల్లో నిన్ను ఏదో కేసులో ఇరికించి పోలీసులకు పట్టించకపోతే, నాది రెడ్డిపుట్టుకే కాదనుకో..." అంటూ ఛాలెంజ్ చేస్తూ "మళ్లీ ఈ వారం వస్తా" అంటూ వెళ్లిపోయాడు బాలిరెడ్డి.

* * *

బాలిరెడ్డి వచ్చివెళ్లిన మూడోరోజు సొట్టోడి భార్యకు, ఈ భూ ప్రపంచానికీ ఉన్న సంబంధం శాశ్వతంగా తెగిపోయింది.

మూడో రోజు చిన్న కర్మ చేసింతరువాత "పెద్దకర్మ ఎట్లచేద్దాం?" అంటూ కొడుకులతో విషయాన్ని కదిలించాడు సొట్టోడు.

"నీ చేతనైతే చేసుకో, లేకుంటే మానుకో. మా దగ్గర మాత్రం నయాపైసా లేదు" అంటూ కొడుకులిద్దరూ చేతులెత్తేసారు.

"కొడుకులకేలేంది, ఓ అయ్యచేతిలో పెట్టిన బిడ్డలమేంజేస్తాం?" అంటూ ఆడబిడ్డలూ జారు కున్నారు. "మాటా, తోటా లేకపోతేమానె, ఓ నాలుగు తెల్లకోళ్లు, ఓ ఐదారుశేర్ల సారా అన్నా తెచ్చి ఏదో కత, కత అనిపించకుంటే రేపొద్దున్న కులపోల్లముందు తలెత్తుకొని తిరిగేదెట్ల?" అం టూ ఆలోచన చేసిన సొట్టోడు చివరికో నిర్ణయా నికొచ్చి "హుస్సు"మంటూ ఇంత పొడవున శ్వాస తీసాడు.

ఎల్లుండి పెద్దకర్మనగా ఆ రోజు తెల్లవారు ఝామున నాలుగ్గంటలకల్లా లేచిన సొట్టోడు రెండు ప్లాస్టిక్ బక్కెట్లు, రెండు వైరు బ్రష్షులు,

రెండు కొబ్బరిచీపుళ్లు, ఓ ఖాళీ లీటరు డబ్బా, ఓ ఇనపబొచ్చ తీసుకుని తను ఎప్పుడూ వెళ్లే శివాలయం వీధికి పోకుండా రంగనాయకులు గుడి ఎదురు రోడ్డు పక్కనున్న మురికి కాలువ చేరి వెంట తెచ్చుకున్న సామాను కింద దించాడు.


సొట్టోడు ఆరోజు రంగనాయకులు గుడి దగ్గర మెట్టపెట్టడానికి ఓ కారణం ఉంది.

ఊళ్లో స్వర్ణకారులంతా కుంపట్లు బందు పెట్టి కూర్చున్నా రంగనాయకులు గుడి రోడ్డులో ఉన్న రామచంద్రా జ్యూయలర్స్ వాళ్ల కార్ఖానా మాత్రం విరామం లేకుండా నడుస్తూనే ఉంది. అద్దాలు బిగించిన గదుల్లో యంత్రాలమీద కొత్త కొత్త డిజైన్లతో బంగారు నగలు తయారవుతూనే ఉన్నాయి. ఆ కార్ఖానాలో నుండి నల్లచీమ కొస మీసమంత బంగారపు పలుకు కూడా బయటకుపోయే అవకాశమే లేకపోయినా, అవసరం సొట్టోణ్ణి అక్కడికి తీసికెళ్లింది.

తెల్లవారేసరికి రంగనాయకుల గుడి ముందు రోడ్డుమీద మట్టినంతా వైరు బ్రష్‌ల సాయంతో ఒకచోటుకి ఊడ్చుకొచ్చాడు సొట్టోడు.

అదే సమయంలో మార్నింగ్‌వాక్కి బయలుదేరి అదే రోడ్డుకొచ్చిన బాలిరెడ్డి సొట్టోడు కన్పించడంతో ముఖానికి నవ్వును తగిలించుకుంటూ దగ్గరకెళ్లి "ఏందిరో సొట్టోడా! మీ కులం కట్టు దప్పి ఈరోడ్డుకొచ్చావేంటి? అయినా నీ పిచ్చిగాని ఇక్కడేం దొరుకుద్దిరా? బూడిద" అంటూ ఎక్కళ్లేని సానుభూతిని కురిపించసాగాడు...

"రేపు లేదు ఎల్లుండి మాయావిడ పెద్దకర్మ. కడుపున పుట్టిన సంతానం కాదన్నా, కట్టుకు



హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో 'ధర్మకేతనం' సాహిత్య కళాపీఠం, మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో 'అమ్మంటే...' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్.వి. యూనివర్శిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్. చిత్రంలో రఘుశ్రీ, శ్రీపాద స్వాతి, సభాధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్.ఎన్. మూర్తి, గ్రంథకర్త రఘువీరప్రతాప్ ఉన్నారు.

న్నోన్ని ఎట్టా కాదనాల? ఏంజెయ్యాలో తోచక ఇటుబడివచ్చిన. పావలో, బేడో దొరికితే కులాని కే పెడతగా" అంటూ ఎదురుగా ఉన్న మురికి కాలువలోకి దిగాడు సొట్టోడు.

సొట్టోడు కాలవలోకి దిగడమే ఆలస్యం అన్నట్లు ఆపైన ఉన్న ఓ ఇంటి కక్కసు గొట్టంలో నుండి నేరుగా కాలువలోకొచ్చి పడిన 'అసిద్ధం' నీళ్లమీద తప్పతేలుతూ వస్తుంటే... కలువతుం డులా కాలువలో నిల్చున్న సొట్టోడు దాన్ని కాలు తో నీటివాలుకు నెట్టేసాడు.

ఆ దృశ్యాన్ని చూసిన బాలిరెడ్డికి కడుపులో దేవినట్టు అన్పించడంతో "మళ్లీ వస్తాన్రా సొట్టో డా!" అంటూ గబగబా ముందుకు సాగిపోయా డు.

కాలువలో నీటిఉరవడి తీసిపోగానే వంగిన సొట్టోడు ఓ పగ్గం పట్టు దూరంలో చక చకా రెండు మూడు కట్టలు కాలవనీటిని అడ్డంగా కట్టేసి, వాటిమధ్య నీటిని బొచ్చెతో అవలకు చిమ్మేసి అక్కడున్న మట్టిని గబ గబా ఎత్తి ఒడ్డున పోసిన తరువాత మళ్లీ యధావిధిగా కట్టలను తెంచేసాడు.

తూర్పువాకిట ఒంటి చక్రపు రథానెక్కిన బాలార్కుడు మెల్లగా సంచారానికి బయలుదేరా డు. పొడవుగా విస్తరించిన గోడల నీడ నుంచి వీస్తున్న ఉదయపు చల్లగాలి, చమటతో తడిసిన సొట్టోడి వంటిని ఆప్యాయంగా స్పర్శించడంతో వాడి కళ్లు అప్రయత్నంగా మూతలుపడసా గాయి.

"ఇట్లా లాభంలేదు" అనుకున్న సొట్టోడు బురదచేతులతోనే నిక్కర్ జేబులో దాచుకున్న సారా ప్యాకెట్టుని బయటకుతీసి మునిపళ్లతో ఓమూల చటుక్కున కొరికి, అందులోని సారా యిని చేదు విషం మింగినవంత బలవంతంగా కళ్లు మూసుకుని మింగి, గట్టిగా సరాయిస్తూ 'తుప తుపా'మని ఊంచుతూ వినాయకుడి గుడి దగ్గర పట్నారోళ్ల హోటల్లో ఇడ్లీ కోసం బయలు దేరాడు.

* * *

టిఫిన్‌చేసొచ్చి మట్టికుప్ప ముందు కూర్చు న్న సొట్టోడు ఇనుపబొచ్చెలోకి ఇంత మట్టిని తీసుకుని మిగతా దాన్నిండా నీళ్లుపోసి, జల్లెడ తో జల్లించినట్టు బొచ్చెను ఆడిస్తూ పైన తేరు కుంటున్న పనికిరాని మట్టిని ఒడుపుగా బయట కు వంచుతూ అడుగున తేరుతున్న పిడికెడు పిడికెడు మట్టిని వేరే బక్కెట్లో వెయ్యసాగాడు...

ఆ విధంగా రెండు మూడు గంటలపాటు కూర్చున్న చోటు నుంచి కదలకుండా కూర్చుని మట్టిని కడిగీ, కడిగీ ఆఖరున ఓ చారెడంత మిగిల్చి ధాన్ని చిన్న స్టీలుగిన్నెలోకి ఎత్తిపట్టుకు న్న సొట్టోడు అక్కణ్ణుంచి నేరుగా చిన్న బజారు లోని రాయపూడి వాళ్ల కొట్టుకెళ్లి ఓ సీసాలో వందగ్రాముల యాసిడ్, మూడు తులాల నవా సరం, మరో మూడుతులాల పాదరసం కొనుక్కు ని వస్తూ, వస్తూ ఈశ్వరమ్మ గుడి దగ్గర దాచిపె ట్టుకున్న తన మట్టికుంపటి, బొగ్గులమూట, కిరోసిన్ ఆయిల్‌బుడ్డినీ తీసుకొచ్చి, కుంపటి నిండా బొగ్గులుపేర్చి, వాటిమీద కొంచెం కిరో సిన్‌వంచి కుంపటి అంటించాడు.

ఓ పక్క కుంపట్లో బొగ్గులు కాస్తా గాలికి అంటుకుంటుంటే మరో పక్క స్టీల్ గిన్నెలో ఎత్తిపెట్టుకున్న మట్టిని కుంపటి మీదికెక్కించి, దానిలో యాసిడ్, నవాసారం వేసి విసురుతూ కూర్చున్నాడు.

కొంతసేపటికి బొగ్గులు అంటుకుని కాలు తుంటే గిన్నెలోని మట్టి యాసిడ్‌లో కుత కుత

ఉడుకుతూ ఘాటైన వాసన, పచ్చని పొగలను నలుదిక్కులా వ్యాపింపజేస్తుంటే కళ్లు, ముక్కులూ మూసుకుంటూ అట్లాగే .మరికొంతసేపు ఉడికించిన తరువాత గిన్నెను కిందికి దించాడు.

ఉడికించిన మట్టిని మళ్లీ బొచ్చెలోకి వంచి, మళ్లీ ఇందాకటిలాగే కడుగుతూ కూర్చున్నాడు. కొంతసేపటికి బొచ్చెఅడుగున ఎండకు తళ, తళా మెరుస్తూ బంగారపు పలుకులు కన్పించసాగాయి... బొచ్చెలో చివరికి మిగిలిన మట్టిలో పాదరసాన్ని వేసి గిర గిరా తిప్పేసరికి బొచ్చి అడుగున తేరుకున్న బంగారపు పలుకులన్నీ పాదరసానికి అంటుకుని ముద్దలా తయారయ్యాయి. ఆ ముద్దను చిన్న మోసలో వేసి కుంపటిమీద వేడిచేసేసరికి పాదరసం, బంగారం విడివడి అచ్చం బంగారం చేతికొచ్చింది.

వచ్చిన బంగారాన్ని చూసుకునేసరికి పొద్దుటి నుంచీ తాను పడిన కష్టాన్ని మర్చిపోయిన సొట్టోడి కళ్లల్లో సాధించానన్న సంతృప్తి కన్పించింది.

ఆ వెంటనే సామానంతా సర్ది, మూటగట్టి తీసుకెళ్లి మళ్లీ ఎప్పటిలాగే ఈశ్వరమ్మ గుడి దగ్గర దాచిపెట్టుకుని నేరుగా రామ్‌లాల్ సేట్ నగల దుకాణం దగ్గరికి నడిచాడు.

గల్లాపెట్టె ముందు కూర్చుని పేపరు చదువుతున్న రామ్‌లాల్ సేట్ అంతదూరం నుండే సొట్టోడి రాకను గమనించి "ఏంభాయ్ సొట్టా! ఈమధ్య కనిపించడమేలేదు" తెచ్చిపెట్టుకున్న ఆత్మీయతను నాలుక చివర అద్దుకుంటూ పలుకరించాడు.


"మీకు తెలియందేముంది సేట్! బంగారం ధర మండిపోతున్న కాన్నుంచీ మట్టేలేకపాయె" అంటూ చొక్కా జేబులోనుంచి భద్రంగా దాచుకున్న బంగారపు పొట్లాన్ని బైటకి తీసి సేట్‌కందించాడు సొట్టోడు.

"మట్టెక్కడ కడిగినా?" అంటూ ఆశ్చర్యంగా పొట్లాన్ని అందుకుని బంగారాన్ని బయటకు తీసి కాటాలో తూచి "ఏడు మిల్లీలుంది" అంటూ కాలిక్యులేటర్‌మీద లెక్కజేసి ఎనిమిదొందల నలభై ఆర్రూపాయలు సొట్టోడి చేతిలో పెట్టాడు రామ్‌లాల్ సేట్.

సొట్టోడు మారు మాట్లాడకుండా ఇచ్చిన డబ్బులు తీసుకుని చొక్కా జేబులో పెట్టుకుంటుండగా ఎరను చూసిన గద్దలా ఎక్కణ్ణుంచో బైక్‌మీద ఊడిపడ్డ బాలిరెడ్డి సర్రున సొట్టోడి చేతిలో డబ్బులు గుంజుకుని లెక్కపెట్టి "ఇదుగో నీ ఖర్చులకుంచుకో" అంటూ నూటయాభైతిర్రూపాయలు సొట్టోడి చేతిలోపెట్టి, మిగిలిన ఏడువందలు తన ఖాతాలో జమవేసుకుని వచ్చినంత వేగంగా వెళ్లిపోయాడు.

బాలిరెడ్డి చర్యకు నెత్తిమీద కాకి తన్నినంతగా విస్తుబోతూ నిల్చుండిపోయాడు సొట్టోడు. అదే సమయంలో...

సోమోజు పాపయాచారి వృద్ధదంపతులు దుకాణం ముందుకొచ్చారు. పాపయాచారి గల్లా పెట్టె ముందు కూర్చున్న రామ్‌లాల్‌సేట్ వంక దీనంగా చూస్తూ "సేట్‌గారూ! నావంట్లో ఓపికున్నంతకాలం మీదగ్గరే పనిచేసాను. ఇవ్వాల్టి రోజుకి వంట్లో శక్తి ఉడిగిపోయింది. ముసలితనంలో ఆదుకుంటాడనుకున్న కొడుకు చెయ్యడానికి పనుల్లేక, తింటానికి తిండిలేక, అప్పుల బాధకు తట్టుకోలేక భార్యతో సహా సైనైడ్ మింగి చచ్చిపోయె. ఇంక వెనుకా, ముందూ ఎవరూ లేని మా బతుకులు మరీ అధ్వాన్నమైపోయాయి. ఇవ్వాల్టికి మూడు రోజుల్నుండి 'టీ'నీళ్లతోనే నెట్టుకొస్తున్నాం. ఆకలికి తట్టుకోలేక మా ముసలి ప్రాణాలు కిందామీదౌతున్నాయి. ఎటూ




పాలుపోక మీరేదన్నా సాయం చేస్తారేమోనని నమ్మకంతో వచ్చాం" అంటూ దీనంగా చేతులు జోడిస్తూ అర్థించాడు.

"ప్రతివాళ్లూ వచ్చి ఇదే కత చెబుతూంటే మేం మాత్రం ఎందమందికని సాయం చేస్తామండీ! అదీగాక ఇవ్వాళ శుక్రవారం. వీలుకాదు పొండి!" అంతకు పావుగంటముందే కొత్తగా గెలిచిన ఎమ్.ఎల్.ఎ.కి సన్మానం చేయాలంటూ పదివేలు వసూలు చేసుకుపోయిన వాళ్లమీద కసంతా పాపం.... ఆ ముసలివాళ్ల మీద చూపిస్తూ తోటకూరకాడలమీది పురుగుల్నో, బిచ్చగాళ్లనో విదిలించినట్లు విదిలించాడు రామ్‌లాల్ సేట్.

అక్కడే నిలబడి ఇదంతా చూస్తున్న సొట్టోడు "పాపం! ఎట్లా బతికిన పాపయాచారి బతుకు ఎట్లా మారిపోయింది? మూడురోజుల్నుంచి తిండి లేదని నోరుతెరిచి అడిగితే మొకం చూడకుండా ఎట్లా కసిరించుకుంటున్నాడో సేట్.

రేపులేదు ఎల్లుండే దాని పెద్దకర్మ. ఇయ్యాల సంపాయించిన పైసలా...? రెడ్డి నూక్కపోయాడు. రేపొక్క రోజులో నేను సంపాయిచ్చేదీలేదు, దానికర్మ చేసేదీలేదు. ఆకలిమీదున్న ఈ పెద్ద మనుషులకు పిడికెడు మెతుకులు దొరికే ఏర్పాటు చేస్తే అదే మాయావిడకు చేసే కర్మతో సమానం. అట్లా జేస్తే దాని ఆత్మగుండా శాంతిస్తది" అనుకున్న సొట్టోడు తన చేతిలో మిగిలిన డబ్బుని ఆ వృద్ధ దంపతుల చేతుల్లోపెట్టి దారిద్ర్యమనే ఎండను స్వీకరిస్తూ... త్యాగమనే వెన్నెలను పంచుతున్న చందమామలా మెరిసిపోతూ నెమ్మదిగా ముందుకు కదిలాడు.

వెళ్లిపోతున్న సొట్టోడికి చేతులెత్తి దండం పెడుతూ వలవలా దుఖించారు పాపయాచారి దంపతులిద్దరూ.

సొట్టోడి త్యాగం వెలుగుకి కళ్లు మూతలు పడుతూంటే సిగ్గుతో తల దించుకున్నాడు రామ్‌లాల్ సేట్. ●